క్లుప్తంగా

నేడు కోటకట్ల ప్రసన్నాంజనేయ స్వామి తిరునాళ్ల



నూజెండ్ల: నేడు మండలంలోని కమ్మవారిపాలెం గ్రామంలో వేంచేసియున్న శ్రీకోటకట్ల ప్రసన్నాంజనేయ స్వామి తిరునాళ్ల వేడుకలు జరగనున్నాయి. తిరునాళ్ల సందర్భంగా దాట్లవారిపాలెం, తలార్లపల్లె, నూజెండ్ల, మారెళ్ళవారిపాలెం, రెడ్డిపాలెం, గురప్పనాయుడుపాలెం, తదితర గ్రామాల నుంచి భక్తులు స్వామివారిని దర్శించుకొని తమ మొక్కులు తీర్చుకుంటారు. తిరునాళ్ల నేపథ్యంలో విద్యుత్ ప్రభను ఏర్పాటు చేసినట్లు గ్రామస్తులు, కమిటీ సభ్యులు తెలిపారు.

స్వయం ఉపాధి పథకం నమోదు గడువు పొడిగింపు

నూజెండ్ల: బీసీ, ఈడబ్ల్యూఎస్ వర్గాలకు చెందిన లబ్ధిదారులకు స్వయం ఉపాధి పథకం నమోదు ప్రక్రియ గడువును ఈనెల 25 వరకు పొడిగించినట్లు ఎంపీడీఓ పావులూరి ఉమాదేవి ఆదివారం తెలిపారు. ఈనెల 22తో గడువు ముగిసిందని లబ్ధిదారుల అభ్యర్థన మేరకు ప్రభుత్వం గడువు సమయం పెంపుదల చేసినట్లు తెలిపారు. కాపు వర్గీయుల చెందిన లబ్ధిదారుల వయసు 50 నుంచి 60 సంవత్సరాల వరకు ప్రభుత్వం పెంచిందన్నారు. మండల ప్రజలు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నేటి నుంచి శిక్షణ తరగతులు

శావల్యాపురం: మండల కేంద్రం శావల్యాపురంలో మండల స్థాయిలో పంచాయతీ కార్యదర్శులు, క్లాప్‌మిత్రలకు సోమవారం ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణా తరగతులు జరుగుతాయని ఎంపీడీఓ పేరుమీనా సీతారామయ్య ఆదివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఐదు రోజుల పాటు నిర్వహించే శిక్షణా తరగతులు శావల్యాపురంలోని స్వచ్ఛ సంపద కేంద్రంలో జరుగుతాయన్నారు. 24వ తేదీ శావల్యాపురం మండలం, 25, 26 తేదీల్లో నూజెండ్ల మండలం, 27,28 తేదీల్లోవినుకొండ మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, క్లాప్‌మిత్రలకు శిక్షణా తరగతులు జరుగుతాయన్నారు.

మహిళలకు అక్షరాస్యతపై పరీక్షలు

శావల్యాపురం: మండలంలోని 15 గ్రామ పంచాయతీలలో ఉల్లాస్ వారి సౌజన్యంతో 39 పరీక్ష కేంద్రాల్లో 390 మంది మహిళలకు అక్షరాస్యతపై పరీక్షలు నిర్వహించినట్లు ఏపీఎం జి.వాసుబాబు ఆదివారం తెలిపారు. గత రెండు నెలల నుంచి నేర్చుకున్న అంశాలపై పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. మండల సమాఖ్యా అధ్యక్షురాలు గోనుగుంట్ల భారతి సీసీ ఖాజావలీ, మేరి కుమారి, తదితరులు పరీక్ష కేంద్రాలను సందర్శించారు.

700 మంది పేదలకు దుస్తులు పంపిణీ



చిలకలూరిపేట: రంజాన్ పండుగ సందర్భంగా పేదలకు పెద్ద ఎత్తున సహాయం చేయడం అభినందనీయమని ఒయాసిస్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ అధ్యక్షురాలు డాక్టర్ కందిమళ్ల జయమ్మ చెప్పారు. రంజాన్ పండుగను పురస్కరించుకొని లక్కీరోడ్‌లైన్స్ అధినేత మొహమ్మద్ యూసుఫ్ ఆలి తన గృహంలో 700 మంది పేదలకు ఆదివారం దుస్తులు పంపిణీ చేశారు. అలాగే 200 మందికి ఆర్థిక సహాయంతో పాటు ముస్లిం యువతుల వివాహం కోసం, విద్యార్థుల చదువుల కోసం రూ. 7.50లక్షలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కందిమళ్ల జయమ్మ మాట్లాడుతూ జకాత్ పేరుతో పెద్ద ఎత్తున దానధర్మాలు చేయడం ఆదర్శనీయమన్నారు. మొహమ్మద్ యూసుఫ్ ఆలీ, ఎండీ కరిమా, అబ్దుల్ బాసిత్, ఒయాసిస్ కార్యదర్శి కరణం విజయ, మున్సిపల్ డీఈఈ షేక్ అబ్దుల్ రహీం, షేక్ నజీర్ అహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఘనవ్యర్థాల నిర్వహణపై శిక్షణ

నాదెండ్ల: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నుంచి ఐదు రోజుల పాటూ ఘనవ్యర్థాల నిర్వహణపై శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ స్వరూపరాణి తెలిపారు. నాదెండ్ల గ్రామంలోని ఘనవ్యర్థాల నిర్వహణ కేంద్రాన్ని నియోజకవర్గ స్థాయిలో శిక్షణా కేంద్రంగా ఎంపిక చేసినట్లు తెలిపారు. చిలకలూరిపేట, నాదెండ్ల, యడ్లపాడు మండలాలకు చెందిన ఎంపీడీఓలు, ఈఓపీఆర్డీలు, గ్రామ కార్యదర్శులు, ఎమ్మార్సీలు, క్లాప్ మిత్రలు, గ్రీన్ గార్డులు నాదెండ్లలో జరిగే కార్యక్రమానికి హాజరవుతారని తెలిపారు. మండలాల వారీగా జరిగే కార్యక్రమంలో సోమవారం నాదెండ్ల, మంగళవారం, బుధవారం చిలకలూరిపేట, గురువారం, శుక్రవారం యడ్లపాడు మండలాలకు చెందిన సంబంధిత అధికారులకు శిక్షణ ఉంటుందన్నారు.

సిబ్బంది కొరతతో ఇబ్బంది!



సిబ్బంది లేక దర్శనమిస్తున్న ఖాళీ కుర్చీలు

- నూజెండ్ల మండల పరిషత్ కార్యాలయంలో విచిత్ర పరిస్థితి
- ఉద్యోగ విరమణ, బదిలీపై వెళ్లిన వారి స్థానంలో ఎవరూ రాని దుస్థితి
- సెలవుల్లో కార్యాలయ సిబ్బంది
- అటెండరు సైతం సెలవులోనే..!
- అభివృద్ధి పనులకు తీవ్ర ఆటంకం
- 27 గ్రామ పంచాయతీల్లోని ప్రజాప్రతినిధులకు అగచాట్లు



నూజెండ్ల ఎంపీడీఓ కార్యాలయం

నూజెండ్ల: నూజెండ్ల మండల పరిషత్ కార్యాలయం సిబ్బంది కొరతతో కునారిల్లుతోంది. బదిలీలు, రిటైర్ అయిన వారి స్థానంలో వేరే వారు రాకపోవడం, మరికొందరు సెలవులపై ఉండడంతో కార్యాలయం అంతా బోసిపోయింది. అభివృద్ధి పనులు పూర్తిస్థాయిలో ఆగిపోయిన దుస్థితి ఏర్పడింది. మండలంలో 27 గ్రామ పంచాయతీలు ఉండగా ప్రభుత్వ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులకు బిల్లులు మంజూరు కాకపోవటంతో చేయాల్సిన పనులకు కాంట్రాక్టర్లు ఆసక్తి చూపటం లేదు.

అటెండరు సైతం సెలవులోనే..

మండల పరిషత్ కార్యాలయంలో ఈఓపీఆర్డీ 8 నెలల క్రితం బదిలీపై వెళ్లారు. ఆ పోస్టు నేటికీ భర్తీ కాలేదు. సూపరింటెండెంట్ పోస్టు సంవత్సరాల నుంచి భర్తీ కాలేదు. సీనియర్ సహాయకులు జనవరిలో ఉద్యోగ విరమణ చేశారు. జూనియర్ సహాయకులు గత కొన్ని రోజులుగా, కంప్యూటర్ ఆపరేటర్ నాలుగు నెలల నుంచి సెలవుల్లో ఉన్నారు. కార్యాలయంలో పూర్తిస్థాయిలో సిబ్బంది లేకపోవటంతో మండలంలో అభివృద్ధి పనులు కుంటుపడ్డాయి. గ్రామాల్లో చేసిన అభివృద్ధి పనులకు సైతం బిల్లులు చెల్లింపులు జరగటం లేదని ప్రజాప్రతినిధులు వాపోతున్నారు. కార్యాలయంలో ఎంపీడీఓ, అటెండర్ మాత్రమే ఉన్నారు. ఇద్దరు అటెండర్లలో ఒకరు సెలవుపై వెళ్లడం ఇక్కడ కొసమెరుపు.

ఎంపీడీఓ వ్యవహార శైలితోనే..!

కార్యాలయ పరిపాలన అధికారి వ్యవహార శైలి కారణంగానే అధికారులు, సిబ్బంది సెలవుపై వెళుతున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఎంపీడీఓ కార్యాలయానికి నూతన అధికారులు, సిబ్బంది వచ్చేందుకు సుముఖత వ్యక్తం చేయటం లేదనే విమర్శలు కూడా వస్తున్నాయి. ఉపాధి సిబ్బంది సైతం ఎంపీడీఓ ప్రవర్తనతో ఒత్తిడి గురవుతున్నట్లు చెబుతున్నారు.

బిల్లులు మంజూరు కాక ఇబ్బందులు..



గ్రామాల్లో చేసిన అభివృద్ధి పనులకు ఎంబుక్ చేయకపోవటం వలన బిల్లులు మంజూరు కాక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాం. ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులు, సిబ్బంది అందరు సెలవుపై వెళ్లటం వలన ఈ దుస్థితి వచ్చింది. బిల్లుల విషయంలో ఎంపీడీఓను పలుమార్లు అడగ్గా సిబ్బంది కొరత ఉందని చెబుతున్నారు.

– నక్కా బుల్లీశ్వరరెడ్డి, అప్పాపురం డీసీ చైర్మన్

పనులు జాప్యం కాకుండా చర్యలు



మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు, సిబ్బంది సెలవుపై వెళ్లిన విషయాన్ని జిల్లా ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చాం. పనులు జాప్యం కాకుండా చర్యలు తీసుకుంటాం.

– పావులూరి ఉమాదేవి, ఎంపీడీఓ, నూజెండ్ల

మసీదుల అభివృద్ధికి కృషి చేశా



ముస్లింలకు ఇఫ్తార్ విందు వడ్డిస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

- మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి
- నాయబ్‌బజార్ పెద్దమసీదు వద్ద ముస్లింకు ఇఫ్తార్ విందు

నరసరావుపేట: నియోజకవర్గంలో పలు మసీదుల అభివృద్ధికి తన వంతు ఆర్థిక, రాజకీయ సహకారం అందజేశానని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా పట్టణంలోని మూడో వార్డు నాయబ్ బజార్ పెద్దమసీదులో పనసతోటకు చెందిన పార్టీ నాయకులు షేక్ ఖాదర్ బాష, షఫీ బ్రదర్స్ ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై ఉపవాస దీక్షలు పాటిస్తున్న ముస్లిం సోదరులకు భోజనం వడ్డించారు. ఈ సందర్భంగా డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ రంజాన్ మాసం నెల రోజులు కఠిన ఉపవాస దీక్షలు ఆచరించిన ముస్లింలందరికీ ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు. గతంలో వరవకట్ట మసీదు షాపింగ్ కాంప్లెక్స్ నూతన నిర్మాణం జరుగుతున్న సమయంలో ఐదు మసీదులకి జీతాలు ఇవ్వలేని, కరెంటు బిల్లులు కూడా చెల్లించలేని పరిస్థితిలో నెలకొందన్నారు. అప్పుడు ఈ ఐదు మసీదులను వక్ఫ్ బోర్డు సహకారంతో వారికి జీతాలు చెల్లించడం జరిగిందన్నారు. అదేవిధంగా రూ.2లక్షల కరెంటు బిల్లులు పెండింగ్‌లో ఉంటే తాను, సీనియర్ నాయకులు షేక్ ఖాజావలి మాస్టర్ కలిసి చెల్లించడం జరిగిందన్నారు. ఊళ్లోని పెద్ద మసీదులకు అభివృద్ధి కోసం రూ.2లక్షలు చొప్పున ఇచ్చి వాటిని అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. సుమారు రూ.2.5కోట్లతో వరవకట్ట మసీదు నిర్మించడం జరిగిందని, ఇదొక పెద్ద అనుభూతి అన్నారు. అదేవిధంగా ప్రతి ఏడాది రంజాన్ పండుగ సందర్భంగా ఈద్గాలో నమాజ్ చేయడం ఆనవాయితీ అని ఈ ఏడాది కూడా అల్లాహ్ దయవల్ల ఈద్గాలో నమాజు చేయాలని కోరుకుంటున్నానని అన్నారు. పవిత్ర రంజాన్ పండుగ సందర్భంగా అల్లాహ్ ప్రతి ముస్లిం మైనార్టీ సోదరుల కుటుంబాల్లో సంతోషాలు నింపాలని, వారి కోరికలను నెరవేర్చాలని కోరుతూ నియోజకవర్గంలోని ముస్లిం సోదరులందరికీ రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు షేక్ ఖాజావలి మాస్టర్, సయ్యద్ ఖాదర్‌బాష, మాజీ కౌన్సిలర్లు షేక్ మస్తాన్‌వలి, మహమ్మద్ మంజూర్, సయ్యద్ ఖాజా, సయ్యద్ గౌస్, ఇమాం బాషా, షేక్ సిలార్ బాష పాల్గొన్నారు.

భగత్ సింగ్ స్ఫూర్తితో ఉద్యమాలు

భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా సీఐటీయూ నాయకుల నివాళి



చిలకలూరిపేటలో భగత్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు



వినుకొండలో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌ల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

నరసరావుపేట: భగత్‌సింగ్ స్ఫూర్తితో పీడిత వర్గ ప్రజల సంక్షేమం కోసం ఉద్యమాలు నిర్వహిస్తామని సీఐటీయూ సీనియర్ నాయకుడు గుంటూరు విజయ్‌కుమార్ అన్నారు. కోటప్పకొండ రోడ్డులోని పల్నాడు విజ్ఞాన కేంద్రంలో ఆదివారం సీఐటీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన భగత్‌సింగ్ 94 వర్ధంతి సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.ఆంజనేయ నాయక్ భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. విజయ్‌కుమార్ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య పోరాటంలో భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ పాత్ర కీలకమన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత లౌకికవాదానికి తూట్లు పొడిచిందన్నారు. దేశంలో, రాష్ట్రంలో ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా, కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా భగత్‌సింగ్ స్ఫూర్తితో నిరంతరం పోరాటాలు సాగిస్తామన్నారు. నాయకులు డి.శివకుమారి పాల్గొన్నారు.

ఘనంగా విప్లవ వీరుల వర్ధంతి..

నరసరావుపేట ఈస్ట్: ఇంక్విలాబ్ జిందాబాద్ నినాదంతో దేశ స్వాతంత్ర్యం కోసం అశువులు బాసిన భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల ఆశయాలు నేటి యువతకు ఆదర్శం కావాలని పలువురు వక్తలు తెలిపారు. అరండల్‌పేటలోని సీపీఐ కార్యాలయంలో ఆదివారం విప్లవ వీరుల వర్ధంతిని నిర్వహించి ఘనంగా నివాళులర్పించారు. పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు, బాలోత్సవ్ ప్రధాన కార్యదర్శి కట్టా కోటేశ్వరరావు, ఏఐఎస్ఎఫ్ అధ్యక్షుడు కాసా గోపీకృష్ణ, నాయకులు పాల్గొన్నారు.

యువతకు ఆదర్శం భగత్‌సింగ్ ..

చిలకలూరిపేట: యువతకు ఆదర్శం సర్దార్ భగత్ సింగ్ అని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ సుభాని చెప్పారు. స్వాతంత్ర్య సమరయోధుడు భగత్‌సింగ్ వర్ధంతిని పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. తొలుత భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులులర్పించారు. మహిళా సమాఖ్య ఏరియా కార్యదర్శి చెరుకుపల్లి నిర్మల, ఏఐటీయూసీ ఏరియా కార్యదర్శి దాసరి వరహాలు, నాయకులు సురభిరాజు, మల్లిఖార్జున్, రాంబాబు, నజీర్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్ ఆశయాల సాధనకు యువత ఉద్యమించాలి ..

వినుకొండ: భగత్‌సింగ్ ఆశయాల సాధన కోసం యువత ఉద్యమించాలని సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతివరప్రసాద్ తెలిపారు. పట్టణంలోని శివయ్య స్థూపంసెంటర్‌లో సర్దార్ భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌ల త్యాగాలను గుర్తు చేసుకుంటూ ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో వర్ధంతి సభను నిర్వహించారు. ఈ సందర్భంగా మారుతీ వరప్రసాద్ మాట్లాడుతూ చిన్న వయసులోనే ఆ ముగ్గురు వీరులు దేశం కోసం ప్రాణాలర్పించి అమరులయ్యారని, తెల్లదొరలు విధించిన ఉరిశిక్షను ఆనందంగా స్వీకరించి 1931 మార్చి 23న ఉరితాడును సైతం ముద్దాడి ప్రాణాలర్పించారన్నారు. అనంతరం ఏప్రిల్ 14వ తేదీవరకు కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై నిర్వహించే సీపీఐ ప్రచార ఆందోళన యాత్రను ప్రారంభించారు. సీపీఐ ఏరియా కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు, రాయబారం వందనం, పిన్నబోయిన వెంకటేశ్వర్లు, ఎ.పవన్‌కుమార్, షేక్ చినసుభాని, కె.మల్లికార్జున, షేక్ మస్తాన్, వెంకటేశ్వర్లు, కరీంబాషా, సైదావలి, మహబూబ్‌ఖాన్, జల్లి వెంకటేశ్వర్లు, బి.లక్ష్మయ్య శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

బ్రిటిష్ వారిని తలపిస్తున్న బీజేపీ పాలన ..

నరసరావుపేట: నేడు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బ్రిటిష్ వారిని మించి ప్రజలపై దోపిడీ, అణిచివేతలకు పాల్పతుందని ప్రజాసంఘాల నాయకులు అన్నారు. ఆదివారం దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం (పీడీఎం) ఆధ్వర్యంలో బ్రిటీష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా దేశ ప్రజల స్వేచ్ఛ స్వాతంత్రం కోసం పోరాడి అసువులు బాసిన కామ్రేడ్ భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌ల 94వ సంస్మరణ సభను అశ్వకుల్లాఖాన్ కాలనీలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా అమరవీరుల చిత్రపటాలకు పూలుచల్లి ఘనంగా నివాళులు అర్పించారు. పీడీఎం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ అధ్యక్షతన నిర్వహించిన సభలో పౌరహక్కుల సంఘ నాయకులు శికినం చిన్న మాట్లాడుతూ దేశ స్వాతంత్ర పోరాటంలో తమ విలువైన ప్రాణాలను భగత్‌సింగ్ ఆయన మిత్రులు అర్పించారన్నారు. అయితే నేటి పాలకులు దేశ సంపదను కొద్దిమంది పెట్టుబడుదారులకు అప్పజెప్పడం కోసం అమాయక ఆదివాసుల్ని చంపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విధానాలు పోవాలంటే నేటి యువత భగత్‌సింగ్‌ను ఆదర్శంగా తీసుకుని ఆయన బాటలో పోరాటాలు కొనసాగించాలన్నారు. గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు వి.కోట నాయక్, పీడీఎం జిల్లా అధ్యక్షుడు షేక్ మస్తాన్‌వలి, నాయకులు దర్యావలి, రాంబాబు, ప్రసాదు, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా త్వరలో ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్



సమావేశంలో మాట్లాడుతున్న సయ్యద్ జిలానీ, హాజరైన పలువురు ముస్లిం నాయకులు

నిర్ణయించిన ముస్లిం పెద్దలు

నరసరావుపేట: నియోజకవర్గంలోని ముస్లిం మైనార్టీల అభివృద్ధి కోసం రంజాన్ అనంతరం పార్టీలకు అతీతంగా ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ ఏర్పాటు చేసుకోవాలని ఆ వర్గ నాయకులు నిర్ణయించారు. ఆదివారం స్థానిక షాదీఖానాలో పట్టణంలోని ప్రతి వార్డుకు చెందిన ఇద్దరు ముస్లిం పెద్దలతో పార్టీలకు అతీతంగా ఆత్మీయ సమావేశం నిర్వహించారు. దీనిలో మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ సయ్యద్ జిలానీతో పాటు సీనియర్ నాయకులు షేక్ ఖాజావలి మాస్టారు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ మీరావలితో పాటు కొంతమంది తమ అభిప్రాయాలను వెల్లడించారు. ముస్లింలు పడుతున్న అనేక సమస్యలు, వాటి పరిష్కారాలు, ముస్లింల అభివృద్ధి, విద్య, ఉద్యోగాలు, రాజకీయంగా ఎదుగుదల, ముస్లింల మైనారిటీల ఆస్తుల పరిరక్షణ, సంక్షేమం, దానికి చట్టబద్ధత కల్పించేందుకు విధివిధానాలను గురించి చర్చించారు. మాజీ కౌన్సిలర్లు షేక్ మస్తాన్‌వలి, షేక్ గఫార్, షేక్ మంజూర్, నర్సింగ్‌వలి, పలు పార్టీలకు చెందిన నాయకులు షేక్ ఖాదర్‌బాష, బొందాల బాషా, షేక్ గౌస్‌పీరా, షేక్ అయూబ్, షేక్ ఆద్రుఫ్, హాజీ కరీముల్లా, షేక్‌బాజీ, రిజిస్టర్ ఆఫీస్ అజీజ్ పాల్గొన్నారు.

వలస జీవులు





పశుగ్రాసం కోసం మూగజీవులు జిల్లాలు, ఎల్లలు దాటి వలస వెళుతున్నాయి. ఆదివారం ప్రకాశం జిల్లా కనిగిరి మండలం చంద్రశేఖరపురం నుంచి, ఎర్రగొండపాలెం మండలం పుల్లలచెరువు, ఇతర ప్రాంతాల నుంచి రేపల్లె కృష్ణానది పరివాహక ప్రాంతానికి వినుకొండ మీదుగా ఆవులను తోలుకుంటూ పశుపోషకులు వెళుతూ కనిపించారు. తమ ప్రాంతాల్లో కనీస పశుగ్రాసం కూడా లేకపోవడం.. నీటి లభ్యత కూడా కష్టంగా మారడంతో ఆవులను ఇలా వలస తోలుకెళ్తున్నామని పశువుల యాజమానులు వాపోయారు.

– వినుకొండ

వ్యక్తిపై దాడి.. కేసు నమోదు

నాదెండ్ల: వ్యక్తిపై దాడి చేసిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జి.పుల్లారావు తెలిపారు. గత నెల 28వ తేదీన మిర్చి విక్రయించి, డబ్బులు తెచ్చుకునేందుకు వెళ్తుండగా దారికాచి తనపై తోట శ్రీనివాసరావు కర్రతో దాడి చేశాడని బుక్కాపురం గ్రామానికి చెందిన అల్లం సుబ్బారావు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ డ్రైవర్ల వేతనాలు పెంచాలి



నరసరావుపేట: నేషనల్ హెల్త్ మిషన్‌లో పనిచేస్తున్న తల్లీబిడ్డా ఎక్స్‌ప్రెస్ 102 డ్రైవర్ల జీతాల మెరుగుదలను పరిగణలోకి తీసుకొని నూతన టెండర్లు పిలిచి ఆమోదించాలని ఏపీ తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ ఎంప్లాయీస్ యూనియన్(సీఐటీయూ) నాయకులు కోరారు. ఆదివారం స్థానిక పల్నాడు విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటుచేసిన సమావేశంలో సీఐటీయూ నాయకులు, డ్రైవర్లు పాల్గొని వినతి పత్రం ప్రదర్శించారు. నాయకురాలు డి.శివకుమారి మాట్లాడుతూ మార్చి 31తో గతంలో పిలిచిన టెండర్ ముగిసిపోనుందన్నారు. ప్రస్తుతం నెలకు కేవలం రూ.7,870లు జీతంతో గత తొమ్మిదేళ్లుగా పనిచేస్తూ తమ కుటుంబాలను భారంగా అప్పులతో పోషిస్తున్నారన్నారు. వారి వేతనం రూ.18,500లు ఇచ్చేవిధంగా చూడాలని కోరారు. ఇప్పటికైనా ప్రభుత్వం టెండర్లు పిలిచేటప్పుడు వాహనాల డ్రైవర్లు జీతాల విషయం పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. జిల్లా గౌరవ అధ్యక్షుడు సిలార్ అహమద్, డ్రైవర్లు పాల్గొన్నారు.

శరవేగంగా దేవాలయ పునర్నిర్మాణ పనులు



రాతి కట్టుబడితో జరుగుతున్న వీరహనుమాన్ దేవాలయ పనులు

శావల్యాపురం: మండలంలోని కనమర్లపూడి గ్రామంలో వీరహనుమాన్ దేవాలయ పునర్నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధి జగర్లపూడి రామగోపయ్య శర్మ తెలిపారు. ఆదివారం దేవాలయ నిర్మాణ పనులపై గ్రామస్తులు దాతలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ నూతన దేవాలయ పునర్నిర్మాణ పనులను రాతి కట్టుబడితో రూ.కోటి వ్యయంతో చేపట్టినట్లు తెలిపారు. నరసరావుపేట పట్టణవాసి కొత్తమాసు శంకరు నిర్మాణ పనుల్లో తన వంతు సహకారం అందిస్తున్నారని తెలిపారు. హైదరాబాదుకు చెందిన ప్రేమ్‌చంద్ పాల్గొని మాట్లాడుతూ దేవాలయ నిర్మాణ పనుల్లో కుల మతాలకు అతీతంగా ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలన్నారు. తన వంతు సాయంగా రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. నూతన దేవాలయంలో నవ అవతార వీరాంజనేయ స్వామి క్షేత్రం,12 అంగులాల శివామహాస్పటిక లింగాకారం కూడా ఏర్పాటు చేస్తున్నట్లు రామగోపయ్య శర్మ వెల్లడించారు. ముక్కపాటి నాగేశ్వరరావు, బోడెపూడి వెంకటేశ్వర్లు, గోరంట్ల హనుమంతరావు, కాసరగడ్డ వెంకటరత్నం, సుబ్బారావు, భక్త బృందం పాల్గొన్నారు.

అసమానతలతో సామాజిక సామరస్యానికి ప్రమాదం



మాట్లాడుతున్న భారత రాజ్యాంగ పరిరక్షణ సమితి అధ్యక్షుడు సుబ్బారావు

నాదెండ్ల: సమాజంలో సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక, రాజకీయపరమైన అసమానతలు దీర్ఘకాలం కొనసాగటం వలనే సామాజిక సామరస్యం ప్రమాదంలో పడిందని భారత రాజ్యాంగ పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు సీహెచ్ సుబ్బారావు చెప్పారు. గణపవరం అంబేడ్కర్‌నగర్‌లోని అంబేడ్కర్ కమ్యూనిటీ హాలులో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సమావేశానికి రిటైర్డ్ ఐఆర్ఎస్ అధికారి బి.రాజేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగ నిర్దేశాలు ఉన్నప్పటికీ నేటికీ భారతీయ సమాజంలో అసమానతలు ఉన్నాయన్నారు. ప్రపంచంలో జాతి వివక్షత కనిపిస్తుందని, కానీ భారతదేశంలో కుల వ్యవస్థ కారణంగా అడుగడుగునా వివక్షత నెలకొందన్నారు. వేలాది ఏళ్లుగా విద్య కేవలం కొద్ది మందికే పరిమితం కావటం, మెజార్టీ కులస్తులను విద్యకు దూరం చేయటం జరిగిందన్నారు. ఇప్పటికీ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్యకు కేటాయిస్తున్న నిధులు 6 శాతం కూడా దాటలేదన్న విషయం కేంద్ర రాష్ట్ర బడ్జెట్ గణాంకాల ద్వారా తేటతెల్లమవుతున్నాయన్నారు. విద్యా వ్యవస్థలో ప్రభుత్వాలు సైన్స్‌కు తగిన ప్రాధాన్యతనివ్వకపోటంతో మన దేశంలో శాస్త్రీయ ఆవిష్కరణలు నామమాత్రంగానే జరుగుతున్నాయన్నారు. రిటైర్డ్ ఉపాధ్యాయుడు దారా కొండయ్య, కె ఓబయ్య, సాంగా వెంకటేష్, అంజిబాబు, కె కోటేశ్వరరావు ఉన్నారు.

నేడు కొత్తపల్లిలో బ్రహ్మం గారి తిరునాళ్ల



మాచర్ల రూరల్: శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి, గోవిందమ్మల 46వ కల్యాణ మహోత్సవం సోమవారం కొత్తపల్లి గ్రామంలో వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ఫౌండర్ అల్లం కోటిరెడ్డి ఆదివారం తెలిపారు. ఉదయం 10.30గంటలకు కల్యాణ మహోత్సవం నిర్వహించి స్వామి వారిని పురవీధుల్లో ఊరేగింపులో మహిళలతో కోలాట ప్రదర్శన, బాణా సంచాల మధ్య మేళ తాళాలతో ఘనంగా ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం సాయంత్రం దేవాలయ ప్రాంగణంలో పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆలయ పూజారి శ్రీనివాసాచారి నేతృత్వంలో నిర్వహించే పూజా కార్యక్రమాలకు భక్తులు పాల్గొనాలని ఆయన కోరారు.